క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు: మండల కేంద్రమైన పిచ్చాటూరులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతిరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే స్థానిక తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని ప్రభుత్వ భూ పంపిణీలో భాగంగా పేదలకు సాగుభూమి పట్టాలను పంపిణీ చేస్తారన్నారు. అనంతరం కల్యాణమస్తు, ముస్లింలకు షాదీ తోఫాను అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అన్నదానం



నాగలాపురం: మండలంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేద నారాయణ స్వామి ఆలయంలో కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా శ్రీ వేదనారయణ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదానానికి ఉభయదాతలుగా హైదరాబాదుకు చెందిన యస్.మల్లికార్జున రెడ్డి, పద్మరేఖ వ్యవహరించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులకు, చెన్నై పాదయాత్ర భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టులోకి రాజాది



నాగలాపురం: అండర్–17 రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టులో నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని రాజాది ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య తెలిపారు. రాజాదిని వ్యాయామోపాధ్యాయులు బాబు, సురేంద్ర, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్‌లో రాణించి జాతీయ జట్టులో కూడా స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు.

ఘనంగా పడిపూజ



భజనలు చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని శ్రీపసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం అయ్యప్ప మాలధారులు పడిపూజను ఘనంగా నిర్వహించారు. మండలవ్యాప్తంగా గ్రామాల్లో అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో పూజలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి చిత్రపటాన్ని పూలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప విగ్రహానికి పాలు, పండ్లు, నెయ్యి, విబూది, పంచామృతంతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వరదయ్యపాళెంలో వర్షం



వరదయ్యపాళెం: మండలంలో గత నాలుగు రోజులుగా చిరుజల్లులతో పాటు ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటలు, కాలువల్లోకి నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు సాగు చేస్తున్న పంటలకు కొంతమేరకు సాగునీటి కష్టాలు తలెత్తే పరిస్థితి నెలకొంది. అయితే తాజాగా పడుతున్న వర్షాలు రైతులకు కొంత ఊరటనిచ్చింది.

మృతుడి కుటుంబానికి చేయూత



నగదును అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని మునలిపేడులో మృతుడి కుటుంబానికి సోమవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి నగదును అందించి చేయూత నిచ్చారు. మునలిపేడుకు చెందిన జయరామయ్య(51) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు గున్నేరి కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునిశేఖర్‌రెడ్డి, మునిరాజా, మహేష్, మోహనకృష్ణ, బత్తెయ్య రాంబత్తెయ్య పాల్గొన్నారు.

వైభవం.. లక్ష దీపోత్సవం



ఆకాశదీపోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటరమణా రెడ్డి





వరదయ్యపాళెం: ప్రత్యేక అలంకరణలో శ్రీ చంద్రకళాంబికా సమేత శ్రీ బ్రహ్మపుదేశ్వరస్వామి, శ్రీకాళహస్తిలో ఊరేగుతున్న శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు



ఏర్పేడు: పరశురామేశ్వర స్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఆలయ ఆవరణలో నిమ్మకాయ దీపాలు వెలిగించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది లక్ష దీపోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, దినేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: పవిత్ర కార్తీక మాసం సందర్భంగా రెండవ కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు నూతన శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా మండలంలోని పాండూరు వద్ద ఉన్న జ్యోతీశ్వరాలయం, వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయం అరుదూరులోని శ్రీ జ్ఞానప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి, వెంకటరెడ్డికండ్రిగ, బత్తలవల్లం, కురింజల్లంలోని శ్రీ చంద్రకళాంబికా సమేత శ్రీ బ్రహ్మపుదేశ్వర స్వామి ఆలయాల్లో వేకువజామున నుంచి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆది దంపతులు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. పెద్దఎత్తున మహిళలు తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం రెండో సోమవారం, కార్తీక పౌర్ణమి సందర్భంగా అయ్యప్ప స్వామివారికి మాలధారణ ధరించి భక్తులు, దీపాలు వెలిగించు భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి సన్నిధిలో మహిళలు నేతిదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రదోష మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన రుద్రహోమం, రుద్రాభిషేకం పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అంతరాయం కలగకుండా ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి, కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్రా రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని శ్రీనివాస తేజ స్కూల్‌లో కార్తీక పౌర్ణమి దీపోత్సవాన్ని సోమవారం మహిళలు ఘనంగా నిర్వహించారు. భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

శివాలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని పలు శివాలయాల్లో సోమవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. పెద్దకన్నలిలో వెలసిన అగస్తీశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. చిన్న సింగమాలలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలోనూ స్వామివారికి విశేష అలంకరణ చేశారు. మహిళ కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

శివయ్య సేవలో కలెక్టర్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి సోమవారం విచ్చేశారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో రామారావు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఆలయంలోని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్, ఈవో కలిసి దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందించారు. ఊంజల్ సేవ మండపం వద్ద నిర్వహించిన ఆకాశదీపోత్సవం పాల్గొని కార్తీక దీపాన్ని వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేకాహ్వానితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం

శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్తీక మాసం శివ కేశవులకు ఎంతో ప్రీతి మాసం అని ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికృష్ణా రెడ్డి అన్నారు. కార్తీక మాసం సోమవారం పౌర్ణమి గడియలు వుండడంతో నేడు ఎంతో విశిష్టమైన దినమన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు.









ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, రుద్రాభిషేక పూజలు చేస్తున్న అర్చకులు, శ్రీకాళహస్తిలో అన్నదానం చేస్తున్న శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, దీపాలను వెలిగిస్తున్న మహిళలు

అలరించిన అన్నమయ్య సంకీర్తనావళి



కార్యక్రమంలో నిర్వాహకులు, అతిథులు

సత్యవేడు: వేదవిజ్ఞాన వేదిక శ్రీసిటీ సాహిత్య ఆధ్యాత్మిక వేదిక శ్రీవాణి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చెన్నైలో అన్నమయ్య సంకీర్తనావళి కార్యక్రమం ఆహుతులను ఎంతగానో అలరించింది. చెన్నై టి–నగర్ ఆంధ్రా క్లబ్‌లోని గోదావరి హాల్‌లో సాగిన ఈ కార్యక్రమం వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి మధు స్వాగతోపన్యాసం, శ్రీవల్లి ప్రార్థనా గీతంతో మొదలైంది. కార్యక్రమానికి వేదవిజ్ఞాన వేదిక చైర్మన్ జేకే రెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టరు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ వేద విజ్ఞాన వేదిక స్ఫూర్తితోనే శ్రీసిటీలో శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదికను గతేడాది ప్రారంభించామన్నారు. పారిశ్రామిక నగరంగా ఎదుగుతున్న శ్రీసిటీలో ఆధ్యాత్మికం, సాహిత్యం, కళలు ఒక భాగం కావాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. శ్రీసిటీ–శ్రీవాణి సౌజన్యంతో చేపట్టిన అన్నమయ్య సంకీర్తనావళి 3వ కార్యక్రమమని తెలిపారు. టీటీడీ శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ మాట్లాడుతూ తాళ్లపాక అన్నమాచార్యుల వారిది రచనాశైలి విలక్షణమైందన్నారు. 32 వేలు కంటే ఎక్కువ సంకీర్తనలను శ్రీ వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ రాశారని, వాటిలో కొన్ని మాత్రమే వెలుగులోకి వచ్చాయన్నారు. అన్నమయ్య కవిత్వంలో తెలుగు పదాల సొగసు తెలుస్తుందన్నారు. అనంతరం భైమన్ విశ్లేషించి వ్యాఖ్యానించిన కొన్ని అన్నమాచార్య సంకీర్తనలను గాయకులు సరస్వతి ప్రసాద్ వీనులవిందుగా ఆలపించారు. వాయిద్య కళాకారులు పి.పాండురంగారావు(తబలా), శంకర్(వయోలిన్), సురేష్ (శృతి) సహకారం అందించారు. ఈ సందర్భంగా భూమన్‌ను, కళాకారుల బృందాన్ని శ్రీసిటీ ఎండీ సత్కరించారు.

వర్షపు నీటితో ఇక్కట్లు



కోనకాల్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహం

ఏర్పేడు: వర్షపు నీటితో వికృతమాలలో కాలనీకి వెళ్లలేక దళితులు ఇక్కట్లు పడుతున్నారు. కాలనీ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రవాహం దాటి వెళ్లాల్సిందే. సోమవారం కురిసిన వర్షానికి కోనకాల్వ ద్వారా ఉధృతంగా నీరు ప్రవహించింది. విద్యార్థులు, గ్రామస్తులు కాలనీ నుంచి ఇతర ప్రాంతాలకు ప్రవహిస్తున్న నీటిలో కాలినడకన వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి, కోనకాల్వపై చిన్నపాటి కాజ్‌వేను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాక్టర్ గొర్రుతో మినుము సాగు





గాజుల పెళ్లూరులో ట్రాక్టరు గొర్రుతో మినుము వేస్తున్న రైతులు, కనమనంబేడులో సాగవుతున్న పంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు, నీర్పాకోట, గాజులపెళ్లూరు, పుత్తేరి, పీవీకండ్రిగ గ్రామాల్లో రైతులు ట్రాక్టరు గొర్రుతో మినుము పంట సాగు చేస్తున్నారు. ట్రాక్టరు(సీడ్ డ్రిల్) విత్తనగొర్రుతో మినుము విత్తనాలను వేయడం ద్వారా పంట ఎదుగుదల బాగుంటుందని, పంటలో కలుపు తీసుకోవడానికి, మందులను పిచికారీ చేయడానికి అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. మండలవ్యాప్తంగా ఈ రబీ సీజన్‌లో 300 ఎకరాల్లో ట్రాక్టరుగొర్రుతో మినుము వేస్తున్నారు. దిగుబడి పెరిగి, మినుములు నాణ్యంగా ఉంటాయని చెబుతున్నారు. మినుము విత్తనాల్లో ఎం45, ఇమిడక్లోప్రిడ్ మందులను కలసి శుద్ధి చేస్తే పంటకు తెగులు సోకదన్నారు. మండలంలోని మినుము రైతులు ట్రాక్టరు గొర్రుతోనే సాగు చేయాలని ఏఓ భారతి సూచించారు.

యూటీఎఫ్ కార్యవర్గంలో డివిజన్‌వాసులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): యూటీఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గంలో శ్రీకాళహస్తి డివిజన్ నుంచి పలువురు ఎంపికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా బి.సూర్యప్రకాష్, జిల్లా కార్యదర్శులుగా కె. మోహన్‌బాబు, సి.వెంకటకృష్ణ, ఓ.విజయకుమార్, రాష్ట్ర కౌన్సిలర్‌గా వై.విజయశ్రీ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులుగా కె.శివకుమార్, ఓ.దీపిక, జిల్లా ఐక్య ఉపాధ్యాయ కన్వీనర్‌గా ఓ.మునెయ్య, జిల్లా అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా కె.నరసింహులు ఎంపికయ్యారు. జిల్లా కమిటీలో శ్రీకాళహస్తి డివిజన్ నుంచి 9 మందికి స్థానం లభించడంపై హర్షం వ్యక్తం చేశారు.

వివాదాస్పద భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



వరదయ్యపాళెం: మండలంలోని చిలమత్తూరు గ్రామంలో వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ గౌరిశంకరరావు సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ఇది ప్రభుత్వ భూమి అని ఆ బోర్డులో రాశారు. ఆయన మాట్లాడుతూ చిలమత్తూరు గ్రామ రెవెన్యూలోని సర్వే నంబరు 58లో ఉన్న 4.25 ఎకరాలు రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి సంబంధిత భూముల్లోకి ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత అవసరం



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృంద సభ్యులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత అవసరమని తంగేళ్లపాళెం ప్రాథమిక సహకార పరపతి సంఘం అధ్యక్షులు మణినాయుడు అన్నారు. తంగేళ్లపాళెం సింగిల్ విండో కార్యాలయంలో సోమవారం బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్, డిజిటల్, నగదు రహిత లావాదేవీలు, వ్యవసాయ, బంగారు ఆభరణాలపై రుణాలు, గృహ రుణాలు, వ్యాపార రుణాలు, డ్వాక్రా రుణాలు, సహకార సమైఖ్య, భారతి డిపాజిట్ స్కీమ్, జీరో బ్యాలెన్స్ అకౌంట్స్, సైబర్ నేరాలు, బీమా పథకాలు తదితర అంశాలపై కళాజాత బృంద సభ్యులతో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, సీఈవో చిరంజీవిరెడ్డి, సూపర్ వైజర్ మురళీమోహన్ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పరశురామేశ్వర స్వామికి నృత్య నీరాజనం

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వే ఫౌండేషన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం 111 మంది కళాకారులతో నృత్య నీరాజనం నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలు, కూచిపూడి నాట్యం కనుమరుగుకాకుండా చిత్తూరు, తిరుపతి, కోడూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు అతిపురాతనమైన పరశురామేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బృందనాట్యం చేశారు. కాలభైరవ అష్టకంతో ప్రతి మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమికి ప్రముఖ శైవ ఆలయాల్లో బృందనాట్య ప్రదర్శన ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య తెలిపారు. కళాకారులు వివిధ దేవతామూర్తుల వేషధారణలో బృంద నాట్యం చేయడంతో భక్తులు తన్మయత్వం చెందారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నృత్య నీరాజనం తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, దినేష్ యాదవ్ పాల్గొన్నారు.





వివిధ దేవతామూర్తుల వేషధారణ, ఆలయ ఆవరణలో నాట్య ప్రదర్శనలో కళాకారుల బృందం